మోహన్ సీత మొహంమీదకి వంగాడు ఆమెను ముద్దుపెట్టుకోవాలని.

సీత గింజుకోసాగింది. మోహన్ మొహం సీత మొహానికి దగ్గరగా వచ్చేసింది. మరో క్షణంలో అతను ఆమెను ముద్దు పెట్టుకుంటాడనగా సీత బలంగా అతని ముక్కుమీద ఒక గుద్దింది.

"అబ్బా....." బాధగా అరుస్తూ కుడిచేత్తో ముక్కు పట్టుకున్నాడు మోహన్.
అదే అదనుగా సీత అతని గుండెలమీద రెండు చేతులూ పెట్టి తన బలమంతా ఉపయోగించి ఒక్క తోపు తోసింది.

మోహన్ మంచంమీద నుండి దబ్బున నేలమీద పడ్డాడు. సీత మంచం మీద నుండి క్రిందికి దూకి ఇంటి బయటకు పరుగుతీసింది.

ఆమె మనసును భయం పూర్తిగా ఆవహించింది.

అవును మరి...కొద్దిలో ఆమె మోహన్ పశువాంఛకు బలి అయివుండేది!

ఆ చీకట్లో భయంతో పరుగుతీస్తున్న సీత ప్రక్కన ఓ స్కూటర్ అగింది.

17

బుచ్చిబాబు ఇంటి తాళం తీసి లోపలికి అడుగు పెట్టాడు. పర్వతాలరావు, పార్వతమ్మ అతన్ని అనుసరించారు.

"అహోహ....! ఆ నాగదేవత మహిమల్ని కళ్ళకి కట్టినట్టుగా ఎంత బాగా తీశాడు బుచ్చీ" అంది లోపలికి వస్తూ పార్వతమ్మ పరవశంగా.

"వెధవాయ్ ఎవడోగాని సినిమా భలే తీశాడ్లే" అన్నాడు పర్వతాలరావు కూడా.

"నాగదేవత హీరోయిన్ తింటున్న రేగిపండులోంచి పెద్ద త్రాచై వచ్చి కాటేసిన సీను హెంత బాగా తీసాడండీ! హబ్బా! నాకైతే చూస్తుంటే చచ్చేంత ఏడుపొచ్చింది" పార్వతమ్మ కొంగుతో కళ్ళు వత్తుకుంది.

"పింజారి వెధవ... ఆ సీన్ కూడా బాగా తీసాడు కదూ?" అన్నాడు పర్వతాలరావు సోఫాలో కూర్చుంటూ.

"ఏం సీనండీ?" అడిగింది పార్వతమ్మ అతని ప్రక్కన కూర్చుంటూ.

"అదే హరీ....కన్నాల లోంచి రెండు కట్లపాములు, బయటకి వచ్చి హీరోని కాటెయ్యబోతే నాగదేవత త్రాచుపాము రూపలో వచ్చి వాటితో ఫైటింగ్ చేస్తుంది....ఆ సీను"

"హవునండోయ్! మీరు చెప్పింది నిజమే. ఆ పాముల ఫైటింగ్ చూస్తుంటే నా ఒళ్ళు గగుర్పొడిచిందనకోండి"

బుచ్చిబాబు మాత్రం వాళ్ళ మాటలు వినడంలేదు. విన్నా అతనికి తలకేక్కదు. ఉదయం కనబడలేదు. సాయంత్రం కూడా సినిమా ప్రోగ్రాం వల్ల సీత దగ్గరికి

వెళ్ళలేకపోయాడు.

సీత బాధపడి వుంటుంది. చాలా కోపం కూడా వచ్చి ఉంటుంది. నిజమేమరి. ముక్కు మొహం తెలీని వాళ్ళింట్లో యెలా వుంటుందీ.. అదీ తను లేకుండా ఒంటరిగా!

కనీసం ఇప్పుడైనా వెళ్తే సీత కోపం తగ్గుతుంది అనుకున్నాడు బుచ్చిబాబు .

బుచ్చిబాబు గడియారం వంక చూసాడు.

టైం తొమ్మిదిన్నర అయ్యింది.

"బాబోయ్! తొమ్మిదిన్నర అయ్యింది" గట్టిగా అన్నాడు బుచ్చిబాబు.

"ఏరా తింగరెదవా .... ఇప్పుడు తొమ్మిదిన్నర అయితేనేం...పదిన్నర అయితేనేం...తినేసి పడుకోడమేగా! టైంతో నీకేం పని?" అన్నాడు పర్వతాలరావు.

"పనుంది కనుకునే!" అన్నాడు బుచ్చిబాబు "నేను బయటకి వెళ్ళాలి."

"ఇంత రాత్రివేళ నీకు బయటకెళ్ళే పనుందా? .... ఏం పని?" మొహం చిట్లిస్తూ అన్నాడు పర్వతాలరావు .

"అంటే సాయంత్రం కొన్ని ముఖ్యమైన ఫైళ్ళు బీరువాలో పెట్టి తాళం వెయ్యకుండా టేబుల్ మీదే పొరపాట్న వదిలేశా. ఇప్పుడు ఆఫీసుకెళ్ళి వాటిని లోపల పెట్టి తాళంవేసి రావాలి" బుర్ర గోక్కుంటూ అన్నాడు బుచ్చిబాబు .

"ఇప్పుడు అఫీసుకెళతావా? ఆ ఫైళ్ళు ఎక్కడికి పోవులే... రేపు పొద్దున ఎలాగూ ఆఫీసు కెళతావుగా?" అన్నాడు పర్వతాలరావు.

"అమ్మో! లాభంలేదు. అవి చాలా అర్జంట్ ఫైల్స్! ఇప్పుడెళ్ళి లోపల పెట్టి రావలసిందే!"

"కాస్త తిని వెళ్ళరా" అంది పార్వతమ్మ.

"వచ్చాక తింటా" అంటూ బుచ్చిబాబు బయటికి పరుగుతీశాడు.

0 0 0

బుచ్చిబాబు డోర్ బెల్ నొక్కాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. అప్పుడే అందరూ నిద్రపోలేదు కదా?

ఇంత రాత్రివేళ వచ్చి డిస్టర్బ్ చేసినందుకు మోహన్ ఏమనుకోడు కదా?

ఏమయిన అనుకోని, సీతకి కోపంరాకుండా వుండాలంటే, బాదపడకుండా వుండాలంటే ఇప్పుడు రాకతప్పదు. బుచ్చిబాబు మరోసారి డోర్‌బెల్ నొక్కడానికి చెయ్యెత్తాడు. కానీ బెల్ నొక్కకముందే తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా మోహన్ .

బుచ్చిబాబుని చూడగానే మోహన్ మొహం పాలిపోయింది. ఆ క్షణంలో అతని మనసులో

ఎన్నోరకాల ఆలోచనలు.

తను మిస్ బిహేవ్ చేసినట్లు సీత చెప్పిందా? ఆ విషయం గురించి అడగడానికి వచ్చాడా?

ఇప్పుడు తను ఏమని సమాధానం చెప్పాలి?

అయినా బుచ్చిబాబుకి తనని నిలదీసి అడిగే హక్కు ఎక్కడిది? సీతేమయినా అతని సొంతమా? భార్య? ఏ అధికారంతో అడుగుతాడు. ఒకవేళ బుచ్చిబాబు జరిగిన విషయాన్ని రామలక్ష్మితో చెప్పేస్తే?

ఈ ఆలోచన రాగానే మోహన్‌కి చాలా టెన్షన్ వచ్చేసింది.

మోహన్ మొహం ఎందుకలా వుందో, తనని లోపలికికూడా రమ్మనకుండా గుమ్మంలో అలా కొయ్యలా ఎందుకు నిలబడ్డాడో బుచ్చిబాబుకి అర్థంకాలేదు.

"మొహంలో ఆ ఎక్స్‌ప్రెసనేంటి? సీత నిద్రపోతోందా?" అని అడిగాడు బుచ్చిబాబు.

బుచ్చిబాబు వేసిన ప్రశ్నకి మోహన్ మనసెంతో తేలికయి పోయింది.

అయితే అతను ఇంకా సీతని కలవలేదన్నమాట ఇంటికి వెళుతూ సీతని చూసిపోదామని వచ్చినట్టున్నాడు.

"సీత ఇక్కడ లేదుగా! మీ యింటికెళ్ళిపోయింది" చెప్పాడు మోహన్ .

బుచ్చిబాబుకి గుండెకాయ ఒక్కసారిగా ఆగినంత పనయింది.

"ఇంటికా? ఎప్పుడు?" కంగారుగా అడిగాడు బుచ్చిబాబు .

ఒకవేళ తను ఇటొస్తే సీత అటెళ్ళిందేమోనని అతని భయం.

సీతని చూస్తే ఇంకేమయినా వుందా? నాన్న చీరేస్తాడు! అనుకున్నాడు బుచ్చిబాబు .

" సీత వెళ్ళిపోయి గంటపైనే అయ్యింది" అన్నాడు మోహన్ .

"గంట పైనే అయిందా మరి ఇంటికి రాలేదే! ఎక్కడికి వెళ్ళిందో ఏమయినా తెలుసా?" అన్నాడు బుచ్చిబాబు .

ఆ ప్రశ్న వినగానే మోహన్ మొహం కత్తి వేటుకి నెత్తురుచుక్క లేని విధంగా అయ్యింది. అతని వెన్నులో చలి మొదలయింది. కొంపదీసి సీతేమయినా ఆత్మహత్య ప్రయత్నం చేయలేదుకదా?

"ఏ......ఏ...ఏమో.... ఎక్కడికీ వెళ్ళిందో నాకేం చెప్పలేదు" అన్నాడు తడబడుతూ.

బుచ్చిబాబు అయోమయంగా మొహం పెట్టాడు.

0 0 0

ఇల్లు సమీపిస్తున్న కొద్దీ బుచ్చిబాబు కాళ్ళు చల్లబడసాగాయి. అడుగులు కూడా తడబడసాగాయి.

ఇప్పుడు సీత కనుక ఇంట్లో వుంటే తనపని గోవిందా? అయినా మోహన్ చెప్పిన ప్రకారం సీత అక్కడినుండి వెళ్ళిపోయి గంటపైనే అయ్యింది. మోహన్ ఇంటినుండి రిక్షాలో పదినిముషాల్లో వచ్చెయ్యవచ్చు.

అయినా ఇక్కడ అమ్మా నాన్నా వుంటే ఎందుకొస్తుంది?

మరి ఇక్కడికి రాకపోతే ఎక్కడికి వెళుతుంది? ఈ ఊళ్ళో సీతకి తెలిసినవాళ్ళెవరు లేరే!

ఒకవేళ  ఇక్కడికి వచ్చి ఇంటికి తాళం పెట్టి వుంటే ఎక్కడికైనా వెళ్ళిందా? అ అవకాశం లేదే. ఇంటి డూప్లికేట్ తాళాలు తన దగ్గిర వున్నాయి.

కొంపదీసి పొద్దున తనకి కనపడలేదని సాయంత్రం కూడా వెళ్ళ లేదని కోపం వచ్చి హైదరాబాదుగాని చెక్కెయ్యలేదు కదా!

ఆలోచనలతో బుచ్చిబాబు బుర్ర గజిబిజిగా తయారయింది.

పార్వతమ్మ తలుపు తీసింది.

"ఎవరయినా వచ్చారా అమ్మా?" భయం భయంగా అడిగాడు బుచ్చిబాబు .

"ఎవరూ రాలేదే! ఏం? ఎవరొస్తారని చెప్పారు?" అడిగింది పార్వతమ్మ.

బుచ్చిబాబు సమాధానం ఏమీ చెప్పలేదు. అతని మెదడు మొద్దు  బారిపోయింది. నిస్సత్తువగా ఇంట్లోకి అడుగుపెట్టాడు. గదిలోంచి తండ్రి గురక వినిపిస్తోంది.

బుచ్చిబాబు డ్రెస్సు మార్చుకోకుండా అలానే సోఫాలో పడుకుండిపోయాడు నీరసంగా.

"అదేంట్రా పడుకుంటున్నావు పాపం! భోజనం చేయి?" అంది పార్వతమ్మ .

"వద్దమ్మా..... ఆఫీసు దగ్గర మా ఫ్రెండ్ తగిలితే అక్కడ హోటల్లో తినేసా....." అన్నాడు బుచ్చిబాబు కళ్ళు మూసుకుంటూ.

పార్వతమ్మ నిట్టూర్చి హాల్లో లైటార్పి గదిలోకి వెళ్ళిపోయింది.

0 0 0

అప్పుడు సరిగ్గా రాత్రి పన్నెండుగంటలయింది.

బుచ్చిబాబు ఒకసారి అటూ ఇటూ దిక్కులు చూసి పోలీసు స్టేషన్‌లోకి అడుగుపెట్టాడు.

ఇంట్లో అతను పడుకున్నాడేగానీ నిద్రపట్టలేదు.

ఎలా పడుతుంది?

అంత రాత్రయినా సీత యింటికి రాలేదు. మోహన్  ఇంట్లో కూడ లేదు.

ఎక్కడికి వెళ్ళిందో? క్షేమంగా ఉందో లేదో తెలీకుండా నిద్రెలా పడుతుంది?

పదకొండున్నర కావస్తుండగా మెల్లగా సోఫాలోంచి లేచాడు.

బెడ్ రూం గుమ్మందగ్గర నిలబడి లోపలికి తొంగి చూసాడు. పర్వతాలరావు , పార్వతమ్మ ఇద్దరో గాఢంగా నిద్రపోతున్నారు.

బుచ్చిబాబు చప్పుడు చేయకుండా వీధి తలుపులు బయటినుండి తాళం వేసుకుని రోడ్డుమీద పడ్డాడు. మొదటి యస్టీడీ టెలిఫోన్ బూత్‌లోకి వెళ్ళి హైద్రాబాద్‌లో సీత వుండే హస్టల్‌కి ఫోన్ చేసి రాధతో మాట్లాడాడు.

సీత గాని హైదరాబాదు వస్తున్నట్లు ఆమెతో చెప్పిందేమో కనుక్కున్నాడు. రాధ లేదని చెప్పింది. ఒకవేళ సీత అక్కడికి వస్తే వెంటనే తన ఆఫీసుకు ఫోన్ చేసి చెప్పమని రాధని రిక్వెస్టు చేసాడు.

రాధకి ఫోన్ చేసాక బుచ్చిబాబు మరింత టెన్షన్ పెరిగింది. అందాకా వున్న ఆ కాస్త ఆశ కూడా పోయింది. సీత గురించి రాధకి కూడా ఏమీ తెలీదు.

సీత ఏమయింది? రోడ్డు మీద ఒంటరిగా వెళుతుంటే ఎవరయినా కిడ్నాప్ చేసారా?

మోహన్  మీద చాలా కోపం వచ్చింది బుచ్చిబాబుకి. అసలు సీతని రాత్రివేళ ఒంటరిగా బయటికి ఎందుకు పంపించాలి?

“ఓయ్“ ఎవరో గట్టిగా అరిచారు.

బుచ్చిబాబు ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు. ఎదురుగా కానిస్టేబుల్ నిలబడి వున్నాడు.

“ఏంటి ఇక్కడ రాతిబొమ్మలా నిలబడి చూస్తున్నావు పోలీస్‌స్టేషన్‌కే బొక్కెట్టాలని చూస్తున్నావా ఏంటి కొంపదీసి” జోక్ చేస్తూ అన్నాడు కానిస్టేబుల్.

ఆ టైమ్‌లో కుళ్ళు జోకులేస్తున్నందుకు వాడి పీక పిసికెయ్యాలన్నంత కోపం వచ్చింది బుచ్చిబాబు .

“కంప్లయిట్ ఇవ్వాలని వచ్చాను! ఇనస్పెక్టర్ గారున్నారా?” అడిగాడు బుచ్చిబాబు సీరియస్‌గా.

బుచ్చిబాబుని ఒకసారి ఎగాదిగా చూసి “రా” అన్నాడు

ఇద్దరూ ఇనస్పెక్టర్ రూంలోకి వెళ్ళాడు.

బుచ్చిబాబు వంక చూస్తూ కళ్ళెగరవేస్తూ అడిగాడు ఇనస్పెక్టర్ యాద్గిరి “గేండి?”

“కంప్లయింట్ ఇవ్వడానికి వచ్చాడు” చెప్పాడు కానిస్టేబుల్.

“చోరీగిట్ల అయ్యిందా? అర్రె! ఇంత రాత్రేల ఏం జూస్తాం! రేపొచ్చి రిపోర్టు రాసియ్” అన్నాడు ఇనస్పెక్టర్ యాద్గిరి.

“చోరీ కాదు ఇనస్పెక్టర్” అన్నాడు బుచ్చిబాబు

“మల్ల? రేపింగ్స్ గిట్టమయినా జరిగినయ్యా నువ్వేం ఫికర్‌చెయ్యకు .... ఆడెడున్నా పట్టుకుంటాం”

బుచ్చిబాబు అసహనంగా మొహం పెట్టాడు.

"అలాంటివేం కాదు. మా ఆవిడ కనిపించడం లేదు" అన్నాడు

"హ(రె! ఇస్కీ గట్లయితే మాకాడ కెందుకొచ్చినవ్వ్. మంచి కళ్ళ డాక్టర్ దగ్గరకి ఫో...అద్దాలు చూసిస్తాడు. మీ యావిడ మంచిగ కన్పిస్తది! హి హి హి యాద్గిరి" కులాసాగా కాళ్ళూగించాడు.

కానిస్టేబుల్ కిసుక్కున నవ్వాడు.

బుచ్చిబాబుకి కోపం వచ్చింది.

"ఏంటండీ నా బాధలో నేనుంటే మీకు వేళాకోళంగా వుందా?" అన్నాడు సీరియస్‌గా.

ఇనస్పెక్టర్ మొహంలో నువ్వు మాయమైనది.

"అచ్చా! చెప్పు బయ్ నేన్ భీ సీరియస్‌గా ఇని దమాక్‌లో కూకోబెడతా"

నీ భాష మండా అని మనసులో అనుకుని "కనిపించడంలేదంటే నా కళ్ళకి ప్రాబ్లం వచ్చిందని కాదు. అలాగయితే మీరు కూడా కనిపించ కూడదు కదా?"

ఇనస్పెక్టర్ అశ్చర్యంగా బుచ్చిబాబు వంక చూసాడు "గేందయ్యా? గంత సిన్నపోరిని పెండ్లి సేస్కున్నావా?"

బుచ్చిబాబు వెర్రిమొహం వేస్కుని ఇనస్పెక్టర్ వంక చూసాడు.

"అస్సల్ మీ ఆవిడ ఏజ్ ఎంత?" అడిగాడు ఇనస్పెక్టర్.

"ఇరవై రెండు ఇరవై మూడు వుంటాయి" చెప్పాడు బుచ్చిబాబు.

"హ(రె! సిన్న పోరిలయితే తప్పిపోతార్‌వయ్యా యాడనన్నా?" ఆశ్చర్యపోతూ అడిగాడు ఇనస్పెక్టర్.

ఆ ప్రశ్న విన్న బుచ్చిబాబుకి గోడకేసి తల కొట్టు కోవాలనిపించింది.

'మా అవిడ ఇంట్లోంచి బయటకి వెళ్ళింది. మళ్లీ ఇంటికి రాలేదు. దీన్ని మీరేమనుకుంటారో అనుకోండి" అసహనంగా అన్నాడు బుచ్చిబాబు .

"హ(రె గట్లనా? హి హి హి!! గీడ క్రిమినల్స్‌తో గెప్పుడూ డిలింగ్ సేసి సేసి మాదీ భీ దమాక్‌లు ఆళ్ళదాని లెక్క మొద్దుగైంది బై!" అంటూ టోపి మీద మొట్టుకున్నాడు "గామె ఫోటో గిట్టున్నదా?"

బుచ్చిబాబు సీత ఫోటో జేబులోంచి తీసి ఇనస్పెక్టర్ ముందు పెట్టాడు.

"ఫోటో మంచిగ తియ్‌లే" అన్నాడు సీత ఫోటో వంక చూస్తూ ఇనస్పెక్టర్ యాద్గిరి.

"ఔను సార్" అన్నాడు కానిస్టేబుల్ కూడా వంగి ఫోటో వంక చూస్తూ.

"లైటింగ్ చాలా తక్కువున్నది! ఏంరా?"

"కరెక్టు సార్" కానిస్టేబుల్ బుర్రకాయ ఉపాడు.